అగ్నిమాపక కేంద్రానికి అరిష్టాలు



గంటల బండి మోగుతూ వెళ్తే ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగిందోనని అందరికీ టెన్షన్ పుడుతుంది. వేసవి వస్తే అగ్నిప్రమాదాల సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుంది. అయితే సత్యవేడు అగ్నిమాపక కేంద్రానికి అన్నీ అరిష్టాలే ఉన్నాయి. ప్రధానంగా ప్రమాదం అనే సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక వాహనానికి నింపుకోవడానికి నీరే ఉండదు. అంతేకాకుండా కాలం చెల్లిన వాహనం కావడంతో ప్రమాదం జరిగిన ప్రాంతానికి నిర్ణీత సమయానికి వెళ్లలేకపోతోంది. ఇవి కాదని సిబ్బంది కొరత వేధిస్తోంది. సత్యవేడు పరిధిలో భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నియంత్రణ ప్రశ్నార్థకంగా మారింది.

- సత్యవేడు ఫైర్ స్టేషన్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత
- కాలం చెల్లిన వాహనంతో ఇబ్బంది
- స్టేషన్ పరిధిలో నీటి వసతి లేదు
- ఏడుగురితోనే విధులు కొనసాగింపు
- పరిధి ఎక్కువ.. వసతులు తక్కువ
- వసతుల కల్పనపై దృష్టి సారించని పాలకులు

వరదయ్యపాళెం: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు సమీపంలోని కాళమనాయుడుపేటలో అగ్నిమాపక కేంద్రం ఉంది. ఈ కేంద్రం పరిధిలో సత్యవేడు, వరదయ్యపాళెం, నాగలాపురం మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా సత్యవేడు నుంచి అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకుంటుంది. సరాసరి సత్యవేడు నుంచి అటు నాగలాపురం వెళ్లాలన్నా.. ఇటు వరదయ్యపాళెం రావాలన్నా.. 30 నుంచి 40 కి.మీల దూరం ఉంది. అయితే ఈ పరిధి మొత్తానికి ఈ ఒక్క వాహనమే వెళ్లాల్సి ఉంది. ఒకేసారి రెండు ప్రమాదాలు జరిగితే ఎక్కడికైనా ఒకేచోటుకు మాత్రమే వెళ్లగలరు తప్ప మరో ప్రమాదస్థలికి వెళ్లలేని పరిస్థితి. అయితే ఈ అగ్నిమాపక కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

ప్రధానంగా అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ఎఫ్ఓ)తో పాటు మరో 15 మంది సిబ్బంది ఉండాలి. అయితే సత్యవేడు అగ్నిమాపక కేంద్రంలో ఎస్ఎఫ్ఓతో పాటు ఇద్దరు డ్రైవర్లు, మరో ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ముగ్గురు ఫైర్‌మెన్‌లు విధులు కొనసాగిస్తున్నారు. దీంతో సిబ్బందికి సెలవులు దొరక్క అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా సెలవు పెడితే విధులకు ఇబ్బంది కలుగుతోంది. ఈ ఏడాది 2024–25కి సంబంధించి 37 ప్రమాదాలు జరగ్గా 10 రెస్క్యూ ఆపరేషన్లు సత్యవేడు అగ్నిమాపక కేంద్రం పరిధిలో నిర్వహించినట్లు సమాచారం.



సత్యవేడు అగ్నిమాపక కేంద్రం, (ఇన్‌సెట్) కాలం చెల్లిన ఫైర్ ఇంజిన్

14 ఏళ్లుగా అదే వాహనం:

సత్యవేడు అగ్నిమాపక కేంద్రంలో 14 ఏళ్లుగా అదే వాహనంతో నెట్టుకొస్తున్నారు. 2011 సంవత్సరానికి చెందిన అగ్నిమాపక వాహనం అప్పుడప్పుడు మొరాయిస్తుంది. ప్రమాదాలు జరిగినప్పుడు సైతం కొన్ని సందర్భాల్లో మొరాయించడంతో సమయానికి చేరుకోలేని పరిస్థితులు ఎన్నో ఉన్నాయి. కాలం చెల్లిన వాహనంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

పట్టించుకుంటారా కూటమి పాలకులు

సత్యవేడు అగ్నిమాపక కేంద్రానికి వసతుల కల్పన గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. అగ్ని ప్రమాదాల సమయంలో ఎంతో అవసరమైన అగ్నిమాపక కేంద్రానికి అన్నిహంగులతో కూడిన వసతులు కల్పించాలంటున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

సత్యవేడు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వివరాలు:

కేడర్	ఉండాల్సిన పోస్టుల సంఖ్య	ఉన్న సిబ్బంది
ఎస్ఎఫ్ఓ	01	01
లీడింగ్ ఫైర్‌మెన్	03	02
ఫైర్‌మెన్	09	03
డ్రైవర్	03	02

ప్రభుత్వానికి నివేదించాం

సిబ్బంది కొరత, నీటి వసతి, ఇతర ఇబ్బందుల గురించి పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతానికి ఉన్న సిబ్బందితో విధులు నిర్వహిస్తున్నాం. వేసవి సీజన్ కావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది జాగ్రత్తగా ఉన్నారు. వాహనం కండీషన్‌లో ఉండేలా ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతూ చర్యలు తీసుకుంటున్నాం.

–రాజయ్య, ఫైర్ ఆఫీసర్, సత్యవేడు ఫైర్ స్టేషన్



సత్యవేడు ఫైర్ స్టేషన్‌లో నీరు రాక నిరుపయోగంగా ఉన్న సంపు

నీటి సదుపాయం అసలే లేదు..

సాధారణంగా సింగిల్ యూనిట్ అగ్నిమాపక కేంద్రం వాహనానికి నీటిని నింపుకునేందుకు ప్రధానంగా నీటి సౌకర్యం ఉండాలి. ఆ దిశగా అగ్నిమాపక కేంద్రం పరిధిలో బోరు ఏర్పాటు చేసుకోవాలి. అయితే సత్యవేడు అగ్నిమాపక కేంద్రం పరిధిలో నీటి సదుపాయం లేదు. దీంతో ప్రమాదం జరిగినప్పుడల్లా సత్యవేడు పంచాయతీ కార్యాలయం వద్ద నీటిని నింపుకోవాల్సిన పరిస్థితి. అక్కడా నీటి సౌకర్యం లేకపోతే ఇబ్బందులు తప్పవు. ఎక్కడో మార్గమధ్యలో చెరువు, పంట పొలాల వద్దకు, బావుల వద్దకు వెళ్లి నీటిని నింపుకోవాల్సిన పరిస్థితి. దీంతో ప్రమాదం జరిగిన చోట జరగాల్సిన నష్టం కంటే ఎక్కువే అవుతోంది.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శనీశ్వరుడికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కూనాటి సురేష్‌కు సన్మానం



కూనాటి సురేష్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

శ్రీకాళహస్తి: 2024 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి గురుబ్రహ్మ అవార్డు అందుకున్న సందర్భంగా కునాటి సురేష్‌ను శనివారం శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యా వ్యవస్థలో కూనాటి సురేష్ వంటి అధ్యాపకులు ఉండడం ఎంతో గర్వకారణం అన్నారు. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో విద్యాశాఖ మంత్రుల చేతుల మీదుగా, రాష్ట్రపతి చేతుల మీదుగా ఎన్నో అవార్డులు, పతకాలు అందుకున్న ఘనత సురేష్‌దే అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీ ముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

రాజయోగ సాధనతో మానసిక ప్రశాంతత



రాజయోగం సాధనపై అవగాహన కల్పిస్తున్న రమణి

సత్యవేడు: రాజయోగ సాధన ద్వారా మానసిక ఉల్లాసం, నైతిక విలువలు పెంపొందుతాయని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ సేవాకేంద్రం పుత్తూరుశాఖ ఇన్‌చార్జ్ రమణి అన్నారు. శనివారం రాత్రి సత్యవేడు సేవాకేంద్రంలో త్రిమూర్తి శివజయంతి వేడుకలు శుక్ర, శనివారాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ సంస్థ గొప్పతనాన్ని వివరించారు. ఆధ్యాత్మిక విలువలతో పాటు మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ రాజయోగం సాధన చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్యవేడు ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్‌కుమార్, శ్రీసిటీ అసిస్టెంట్ పీఆర్‌ఓ రవి, స్థానిక వీరభద్ర స్వామి ఆలయ ధర్మకర్త, రవికుమార్ బ్రహ్మ కుమారి ఈశ్వరీయ సత్యవేడు సేవాకేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

దళితుల నిరాహార దీక్షకు సంఘీభావం



మాట్లాడుతున్న రామానాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో దళితులు గత 11 రోజులుగా ఇంటి స్థలాల పట్టాల కోసం దళితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు ఆయన శనివారం సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్లు 252, 253, 254లో దళితుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమికి పట్టాలు ఇవ్వాలన్నారు. స్థానికేతుడైన డాక్టరు బత్తెయ్యనాయుడు ఎకరా 75 సెంట్లు భూమిని స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేశారని తెలిపారు. గ్రామంలోని పలువురికి ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతుంటే బత్తెయ్యనాయుడు భూక్రమణను అడ్డుకున్న 10 మంది దళితులపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం అన్నారు. దీంతో మరోసారి అధికారులు కబ్జాదారులకు కొమ్ము కాస్తున్నారనడానికి ఈ ఘటనే సాక్ష్యం అని ఆరోపించారు. తక్షణమే దళితులపై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని, దళితులకు ఒక్కొక్కరికి 3 సెంట్లు స్థలాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని, తిరుపతి కలెక్టరు ఆఫీసు వరకు పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. అనంతరం సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు స్థానికేతరులకు అమ్ముడుపోయి ప్రభుత్వ భూమిని అప్పజెబుతున్నారని ఆరోపించారు. దళితులకు ఇంటి స్థలాలు ఇచ్చేవరకు రిలే నిరాహార దీక్ష చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, దళితులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యపై వినతి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: బంగారమ్మకాలనీ సమస్యలు పరిష్కరించాలని బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవాసంఘం సభ్యులు శనివారం తొట్టంబేడు రెవెన్యూ అధికారులను కోరారు. వారు తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలనీలో మురుగునీరు వెలుపలకు వెళ్లకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, ఈదులగుంట చెరువును ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి ద్వారా మురుగును కన్నలి కాలువకు తరలించాలన్నారు. అయితే ఈ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, అధికారులు స్పందించి మురుగునీరు వెళ్లే మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా బంగారమ్మ చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. గతంలో చెరువులో బోట్‌క్లబ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు అప్పటి కేంద్రమంత్రి జయరామ్ రమేష్, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఉందన్నారు. అధికారులు స్పందించి చెరువు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు స్థానిక సర్పంచ్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఉదయం 8 గంటలకు అతిథుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు.

ఉయ్యాలసేవలో కల్యాణ వెంకన్న



ఉభయనాంచారులతో కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవేరులకు ఉయ్యాలసేవ నిర్వహించారు. సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం కైంకర్యాలను పూర్తి చేసిన అర్చకులు తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామిని అధిష్టింపజేశారు. ఊంజల్ మండపంలో గంట పాటు నిర్వహించిన ఊయ్యాల సేవలో ఉత్సవమూర్తులను భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రంగస్థల నటుడి మృతి



భార్యతో సుబ్రమణ్యం(ఫైల్)

నారాయణవనం: నాటక, రంగస్థల నటుడు సుబ్రమణ్యం(76) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగకు చెందిన సుబ్రమణ్యం కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సుబ్రమణ్యం మృతి తీరని లోటని ఆయన శిష్యుడు, సహ నటుడు నాగేంద్ర కన్నీటిపర్యంతమయ్యారు.

హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ అధికారులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రదోష క్షేత్రంగా బాసిల్లుతున్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శనివారం తిరుపతి డివిజన్ దేవదాయ శాఖ తనిఖీదారులు పి.పణిరాజశయన్ పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ లత మాట్లాడుతూ మాట్లాడుతూ ఆలయంలో 60 రోజులకు గాను దేవస్థానం హుండీల ద్వారా రూ. 7,52,706, అన్నదానం హుండీ ద్వారా రూ. 62,632 మొత్తం రూ.8,15,338 దేవస్థానానికి భారీ ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబల్ రవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని వినతి



ఈఓ బాపిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న బంగారమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులను చేపట్టాలని బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు కోరారు. శనివారం ఈఓ బాపిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ ఆలయానికి 2011లో మహాకుంభాభిషేకం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆలయ జీర్ణావస్థకు చేరిందని, జీర్ణోద్ధరణ పనులు చేపట్టి మహా కుంభాభిషేకం నిర్వహించాలన్నారు. అందుకు ఈఓ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వనమాల నాయుడు, మనోహర్, శ్రీనివాసులు, మాధవయ్య, సోమశేఖర్‌నాయుడ, లీలా మోహన్, గోవిందస్వామిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం



శిక్షణ ఇస్తున్న డివిజన్ డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: రీసర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, తహసీల్దార్ సుబ్రమణ్యం, డివిజన్ డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్‌రావు, డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు తెలిపారు. శనివారం పార్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని చల్లమాంబపురం, తిమ్మభూపాలపురం రెవెన్యూ గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే కోసం సర్వేయర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల రీసర్వేతో భూవివాదాలు పరిష్కారం అవుతాయని, రీసర్వే రైతులకు ఓ వరమని, అందరూ సహకరించాలన్నారు. రీసర్వేలో అన్‌రిజిష్టర్, వంశపారంపర్యం భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామని, పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తారన్నారు. సర్వే అధికారులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. చల్లమాంబపురంలో 265.55 ఎకరాలు, తిమ్మభూపాలపురంలో 384.98 ఎకరాల భూమిని రీసర్వే చేస్తామని తెలిపారు. రెండు గ్రామాలకు గ్రామ సరిహద్దులను గుర్తించి, త్వరలోనే గ్రామసభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్ కుమార్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

నాలుగు నెలల ఉత్కంఠకు తెర

- కూటమి నేతల కుట్రలకు రేణిగుంటలో వాయిదా పడుతూ వచ్చిన వేలం
- భారీ బందోబస్తు నడుమ వేలం నిర్వహించిన అధికారులు
- పంచాయతీకి భారీ ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అధికారులు, వేలంపాటలో పాల్గొన్న గుత్తేదారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గత నాలుగు నెలలుగా పంచాయతీ వేలంపాటలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. కూటమి నాయకులు పన్నిన పన్నాగాలను పటాపంచలు చేస్తూ వేలంపాటలో పాల్గొని పంచాయతీకి ఎన్నడూ లేని ఆదాయాన్ని చేకూర్చారు. రేణిగుంట మేజర్ పంచాయతీలో శనివారం ప్రధాన ఆదాయ వనరులైన వారపు సంత, బస్టాండు, కూరగాయల మార్కెట్, దుకాణ సముదాయాల వేలంపాట నిర్వహించారు. వేలంపాటల తేదీలను ప్రకటించడం.. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతున్నట్లు మరో ప్రకటన చేయడం సర్వసాధారణంగా మారింది. ఎట్టకేలకు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు నడుమ డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభురెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ ఆదాయ వనరులకు వేలంపాట నిర్వహించారు. ప్రధానంగా వారపుసంత వేలంపాట దినేష్, కృష్ణవేణి మధ్య ఉత్కంఠగా సాగింది. చివరకు దినేష్ రూ.16.54 లక్షలు హెచ్చుపాట పాడిసంతను దక్కించుకున్నారు. అదేవిధంగా దినసరి కూరగాయల మార్కెట్ వసూలు పోటాపోటీగా జరిగింది. చివరకు వడ్డిమిట్ట చంగల్‌రాయులు రూ.20.5 లక్షలకు హెచ్చుపాట పాడి సొంతం చేసుకున్నారు. దుకాణ సముదాయాల్లో 15 దుకాణాలు ఉండగా వాటిలో ఐదు దుకాణాలు మాత్రమే గుత్తేదారులు పాట పాడారు. మిగిలిన 10 దుకాణాలు, బస్టాండు వాయిదా పడింది. సుధాముని రూ.29,500, సంతానం రూ.12,500, ముంతాజ్ రూ.22,500, ధనశేఖర్ రూ.15,500, జలీల్ రూ.3,500 నెలవారీ షాపులను దక్కించుకున్నారు. సర్పంచ్ నగేశం, కార్యదర్శి మణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



వేలం సమయంలో పంచాయతీ కార్యాలయం గేటును మూసివేసిన వైనం

పోలీసుల బందోబస్తు..

ఎన్నడూ లేనివిధంగా ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు 20 మంది దాకా కానిస్టేబుళ్లు వేలంపాటలో బందోబస్తు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలోకి ఇతరులను ఎవరూ రానివ్వకుండా గేట్లు మూసివేసి వేలంపాట సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. కానీ టీడీపీ కార్యకర్తలను మాత్రం వేలంపాట జరిగే ప్రదేశానికి అనుమతి ఇవ్వడం అక్కడ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

టీడీపీ నాయకుల హడావుడి..

వేలంపాటలో తమ వారికి లబ్ధి చేకూర్చేందుకు టీడీపీ నాయకులు వేలం జరిగే చోటకు చేరుకుని నానా హడావుడి చేశారు. అయితే పోలీసులు టీడీపీ నాయకులను లెక్క చేయలేదు. మరోవైపు గుత్తేదారులు వేలంపాటలో పాల్గొని ధీటుగా పోటీ ఇవ్వడంతో టీడీపీ నాయకులు ఖంగుతిన్నారు. ఎట్టకేలకు ఎన్నడూ లేనివిధంగా రేణిగుంట పంచాయతీకి ఆదాయం రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఫారంపాండ్లు రైతులకు వరం



కందాడలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

రేణిగుంట: ఉపాధిహామీ పథకం కింద నిర్మించుకునే ఫారంపాండ్‌లతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని జిల్లా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన ఏర్పేడు మండలం కందాడ, శ్రీకాళహస్తి మండలం తొండమనాడులో ఫారంపాండ్ల నిర్మాణాలను పరిశీలించారు. రైతు శ్రీను పొలంలో తవ్వుతున్న ఫారంపాండ్‌ను తనిఖీ చేశారు. వర్షపునీటిని ఒడిసిపట్టి ఫారంపాండ్‌లలో నిల్వ చేసుకోవడం వల్ల భూగర్భ జల్లాలు వృద్ధి చెంది బోరు, బావుల్లో సమృద్ధిగా నీరు ఉంటుందన్నారు. తద్వారా రైతులు పంటలు పండించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. ఫారంపాండ్‌లో నీరు భూమిపై నుంచి 2 మీటర్ల లోతు వరకు ఉండడం వల్ల భూమిలో తేమశాతం పెరుగుతుందని తెలిపారు. అలాగే ఫారంపాండ్‌లు తవ్వకున్న రైతుల పొలాల్లో మిత్ర పురుగులు, వానపాములు అధికంగా వృద్ధి చెందినట్లు గమనించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఫారంపాండ్ గట్టు చుట్టూ భూమి వృథా కాకుండా కొబ్బరి చెట్లు, ఇతర పండ్ల చెట్లను పెంచుకోవచ్చన్నారు. పంట పొలాలకు ఫారంపాండ్ వల్ల నీటి సంరక్షణతో పాటు చేపల పెంపకం చేపడితే రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. అనంతరం ఎండీ పుత్తూరులో నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓలు డి.చంద్రశేఖర్ రాజు, అవిలాల దేవరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినోద్, టెక్నికల్ అసిస్టెంట్లు శాలి మనోహర్, రవీంద్రుడు, పట్టాభి రెడ్డి, జూనియర్ ఇంజినీర్ బాలాజీ రావు, కూలీలు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా పని చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ గీత

ఏర్పేడు (రేణిగుంట): అధికారులు జవాబుదారీగా పని చేసి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గీత అన్నారు. ఏర్పేడు మండల మీట్ శనివారం వెలుగు కార్యాలయంలో ఎంపీపీ గీత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు కావేరి తిరుమలయ్య మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచులను సమన్వయం చేసుకుని కార్యదర్శులు పని చేయాలన్నారు. ఏర్పేడు మండలంలో సబ్సిడీ వ్యవసాయ పనిముట్లపై అవగాహన కల్పించడంలో ఏఓ విఫలమయ్యారని, అసలు ఆయన తన కార్యాలయానికే రారని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య అన్నారు. జంగాలపల్లి, శ్రీనివాసపురంలో దళితవాడ వాసులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సర్పంచ్ నారాయణ కోరారు. ఎండీ పుత్తూరు దళితవాడలో గతంలో కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలని సర్పంచ్ మోహనప్రియ కోరారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని చెన్నంపల్లి సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్యం, కోఆప్షన్ సభ్యుడు బలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.